# చేకూరపాడు గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి ఓరియంటల్ హైస్కూల్ వజ్రోత్సవ సందర్భం

## షేక్ షబ్బీర్

నా పేరు షేక్ షబ్బీర్, మా గ్రామం త్రోవగుంట, 1981 వ సంవత్సరంలో శ్రీ వేణుగోపాలస్వామి ఓరియంటల్ హైస్కూల్, చేకూరపాడులో 6వ తరగతిలో చేరినాను. నేను చేరేటప్పటికి మా గ్రామంలో 7వ తరగతివరకు స్కూల్ ఉన్నది. కానీ మా ఊరినుండి చేకూరపాడు స్కూల్ మంచి పేరు ఉన్నందున అప్పుడు 20 మంది వరకు ఆడ, మగ 10వ తరగతిలో ఉండేవాళ్ళు. నేను 6వ తరగతి కాబట్టి అందరి కన్నా చిన్నవాడిని. త్రోవగుంట మా యిండ్ల కాడి నుండి ఆడపిల్లలు ఉన్నందున వారు నన్ను పిలుచుకుని వెళ్లేవారు. మగ పిల్లలు నన్ను వెళ్ళు దారిలో ఆడపిల్లలతో వెళ్తున్నానని ఎగతాళి చేసే వాళ్ళు అందరు నేను ఇంట్లో చెబితే వాళ్ళు ఆడపిల్లలతోనే వెళ్తూ వాళ్ళేమన్న అన్నారు. త్రోవగుంట నుండి చేకూరపాడు పొలాల గుండా అడ్డదారిన వెళ్లేవాళ్ళం. భోజనం క్యారేజీల్లో ఒక్క గిన్నె మధ్యలో చెరువు వద్ద తినేవాళ్ళం. సరదాగా నవ్వుకుంటూ, పాడుకుంటూ మన తన కులం, ఉండేవాళ్ళు, లేనోళ్ళు అనే తేడాలు ఉండేవి కావు. ఎవరైనా ఏరా, ఓరె అనుకునేవాళ్ళం. కానీ ఈ రోజు అలా అనలేకపోతున్నాం. అది కేవలం చదువు వలననే. స్కూల్‌లో చదువు చెప్పిన మా ప్రతి గురువులు అందరికి మరుజన్మ ఉంటే అదే స్కూలు, అదే మాస్టర్ల దగ్గర చదువుకునేలా చేయమని మన దేవుడ్ని ప్రార్థిస్తున్నాం. తర్వాత మా ఊరివాళ్ళు 10వ తరగతి ఐపోయినాక మా ఊరి నుండి నేను ఒక్కడినే వెళ్ళాల్సివచ్చింది. అప్పుడు త్రోవగుంట నుండి బస్ రోడ్‌న సంచి తగిలించుకుని నడుచుకుంటూ వస్తుంటే ఏ బండి వచ్చిన చెయ్యి ఎత్తేవాడ్ని. ఎక్కించుకున్న చేకూరపాడు దొంకకాడ దింపేవాళ్లు. మరలా అక్కడి నుండి నడిచి స్కూల్‌కి వెళ్ళేవాడ్ని. తర్వాత కొన్నిరోజులు యస్‌బిబియస్ (తుమ్మలవెంకయ్యగారి) బస్సు ఊళ్లోకి వచ్చేది. తర్వాత సైకిల్ వేసుకొని వెళ్ళేవాడ్ని. నాతో పాటు మా ఊరి నుండి ఇంకొకరు ఉన్నా తను ఇరెగ్యులర్. నాకు హింది మాస్టర్ గారు వాడి ఊతపదం 'అరె ఘూస్' అనేవారు కోపంతో, మేడమ్‌గారు "బోటా" అనేవారు. 10వ తరగతిలో నైట్ ట్యూషన్ పెట్టినారు. నైట్ స్కూల్‌లోనే ఉండేవాళ్ళం పరీక్షలు ఐపోయాక ఎవరు, ఎక్కడ ఏమేమి చేస్తున్నారో తెలియని మాకు ఈ వజ్రోత్సవం ద్వారా కలవబోతున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. పూర్వ విద్యార్థుల్లారా అందరం కలుద్దామని ప్రార్థిస్తున్నాను.

**మీ షేక్ షబీర్ (త్రోవగుంట)**